సాక్షి అనకాపల్లి

ఆదివారం । 19 । జనవరి । 2025



వైభవంగా భారీజం పండగ

పాడేరు:గిరిజనుల సంప్రదాయంలో భాగమైన భారీజం పండగను శనివారం వనుగుపల్లిలో ఘనంగా నిర్వహించారు.



సమ్మె విరమణ

8లో

గోవాడ సుగర్స్ కార్మికులు సమ్మె విరమించారు. దీంతో రెండ్రోజుల్లో రెగ్యులర్ క్రషింగ్ ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు.



అప్పన్నకు నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి అర్చకస్వాములు శనివారం సంప్రదాయబద్ధంగా నిత్యకల్యాణం నిర్వహించారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీలో నియామకాలు

- అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకునిగా ధర్మశ్రీ
- చోడవరం సమన్వయకర్తగా అమర్‌నాథ్
- మాడుగుల సమన్వయకర్తగా బూడి ముత్యాలనాయుడు



తాటిచెట్లపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు నియామకాలు చేపడుతూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకునిగా కరణం ధర్మశ్రీ, చోడవరం నియోజకవర్గ సమన్వయకర్తగా గుడివాడ అమర్‌నాథ్, మాడుగుల నియోజకవర్గ సమన్వయకర్తగా బూడి ముత్యాలనాయుడిని నియమించారు. అలాగే వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను), గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా తిప్పల దేవన్‌రెడ్డిని నియమించారు.

నర్సీపట్నం డీఎస్పీగా శ్రీనివాసరావు



నర్సీపట్నం: నర్సీపట్నం డీఎస్పీగా పి.శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం విజయనగరం జిల్లా బొబ్బిలి డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావును నర్సీపట్నం బదిలీ చేశారు. రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత డీఎస్పీ మోహన్‌కు నాలుగు నెలల క్రితమే విజయవాడ ఇంటెలిజెన్స్‌కు బదిలీ అయినప్పటికీ, ఆయన స్థానంలో ఎవరినీ నియమించకపోవడంతో రిలీవ్ కాలేదు. తాజా ఉత్తర్వులతో డీఎస్పీ మోహన్ బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు.

బైక్ మెకానిక్ నిజాయితీ



పోలీసుల సమక్షంలో బాధితురాలికి హ్యాండ్ బ్యాగ్ అందజేస్తున్న మెకానిక్ రాజు


అచ్యుతాపురం: విలువైన వస్తువులతో దొరికిన బ్యాగ్‌ను పోలీసులకు అప్పగించి బైక్ మెకానిక్ తన నిజాయితీ నిరూపించుకున్నారు. సీఐ గణేశ్ అందించిన వివరాలు.. అచ్యుతాపురం మండలం జంగులూరుకు చెందిన బైక్ మెకానిక్ రాజుకు శనివారం ఒక హ్యాండ్ బ్యాగ్ దొరికింది. అందులో తులం బంగారు వస్తువు, రూ.1750ల నగదు ఉన్నాయి. రాజు ఆ బ్యాగ్‌ను స్థానిక పోలీసులకు అప్పగించారు. దర్యాప్తు చేసిన పోలీసులు అప్పికొండ గ్రామానికి చెందిన మైలపల్లి భారతి పూడిమడక మార్గంలో కుటుంబంతో సహా వెళ్తుండగా బ్యాగ్ పోగొట్టుకున్నట్లు గుర్తించారు. వాస్తవం ధ్రువీకరించుకున్న అనంతరం భారతికి బ్యాగ్‌తో సహా నగదును, బంగారాన్ని పోలీసులు అప్పగించారు. నిజాయితీగా వ్యవహరించిన రాజును అభినందించిన సీఐ గణేశ్ ఐదు వందల రూపాయల నగదు బహుమతి అందజేశారు. స్థానిక సోషల్ మీడియాలో ఈ ఉదంతం వైరల్ అవుతోంది.

రైతు కష్టాలు తడిసి మోపెడు

అందరికీ అన్నం పెట్టే అన్నదాత పరిస్థితి ఈ ఏడాది దయనీయంగా మారింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చేవరకు నానా ఇబ్బందులు పడ్డాడు. తీరా పంట చేతికొచ్చిన తరువాత గిట్టుబాటు ధర లేక దళారుల చేతిలో మోసపోతున్నాడు. కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి రైతుకు ఇస్తామన్న పెట్టుబడి సాయం అందించలేదు. విపత్తుల సమయంలో అందించే ఉచిత పంట బీమాకు ఎగనామం పెట్టింది. పంట చేతికొచ్చిన తరువాత కూడా తేమ శాతం ఎక్కువగా ఉందంటూ చిన్నపాటి ముక్కిన ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు తిరస్కరిస్తున్నారు.



ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి జయంతి



ధాన్యం కొనుగోలు కేంద్రాలు **72**	ధాన్యం కొనుగోలు లక్ష్యం **40** వేల మెట్రిక్ టన్నులు
ధాన్యం దిగుబడి **3.5** లక్షల మెట్రిక్ టన్నులు	ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం **9,361** మెట్రిక్ టన్నులు

ముక్కిన ధాన్యం కొనని మిల్లర్లపై చర్యలు

జిల్లాలో 72 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపడుతున్నాం. ఇప్పటివరకు 9,361 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. కేంద్ర ప్రభుత్వం విధించిన నియమ నిబంధనల ప్రకారం తేమ శాతం 17 కన్నా అధికంగా ఉంటే తీసుకోకూడదు. 18 శాతం నుంచి 19 శాతం వరకు కూడా మేము అనుమతిస్తున్నాం. 17 శాతం కన్నా తేమ ఎక్కువగా ఉంటే ఎండలో ఆరబెట్టి తీసుకురమ్మని అవగాహన కల్పిస్తున్నాం. ముక్కిన ధాన్యం మిల్లర్లు తీసుకోకుంటే చర్యలు తీసుకుంటాం. చాలామంది రైతులు ఆర్‌జేఎల్ ధాన్యం బయట ప్రైవేట్ వారికి ఎక్కువ డబ్బులకు అమ్మేసుకుంటున్నారు. ఆర్‌జేఎల్ కానటువంటి ధాన్యమే మాకు అమ్ముతున్నారు.

– జయంతి, పౌరసరఫరాల శాఖ అధికారి

- ముక్కిన ధాన్యం కొనుగోళ్లకు మిల్లర్లు ససేమిరా
- ఖరీఫ్ సీజన్‌లో రెండుసార్లు వరి పంట మునక
- పూర్తి స్థాయిలో ముక్కిన ధాన్యం తీసుకోమంటున్న అధికారులు
- జిల్లాలో నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు
- దళారుల వలలో అన్నదాతలు



పాయకరావుపేట నుంచి ట్రాక్టర్‌లో తరలిస్తున్న ధాన్యం బస్తాలు

సాక్షి, అనకాపల్లి: ఈ ఏడాది ఖరీఫ్‌లో పంట ఆలస్యం కావడంతో ధాన్యం విక్రయించేందుకు రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో గతేడాదిలో భారీ వర్షాల కారణంగా సుమారుగా 3 వేల ఎకరాలకు పైగా పంట నీట మునిగింది. దిగుబడి తగ్గింది. ధాన్యం ముక్కిపోయాయి. మిల్లర్లు, ప్రైవేట్ దళారులు కొనడానికి ససేమిరా అంటున్నారు. దీంతో చాలా వరకు రైతులు పండిన పంట నూర్పులు చేయకుండా కుప్పలు వేసుకున్నారు. జిల్లాలో మందకొడిగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాగుతోంది. గతేడాది డిసెంబర్ మొదటి వారం నుంచి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ జరుగుతోంది. ఆర్‌జేఎల్ ధాన్యం అయితేనే మిల్లర్లు, ప్రైవేట్ దళారులు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. అనకాపల్లి మండల పరిధిలో తగరంపూడి, సీతానగరం, తుమ్మపాల, వెంకుపాలెం, రేబాక, శంకరం, ఆవఖండం భూములు, కశింకోట మండలంలో నూతలగుంటలపాలెం, ఏనుగుతుని, ఏఎస్ పేట, కశింకోట, వెదురుపర్తి, గొబ్బూరు, నర్సింగబిల్లి, నక్కపల్లి, పాయకరావుపేట, నాతవరం, నర్సీపట్నం, బుచ్చెయ్యపేట మండల పరిధిలో వంట నీటి మునకకు గురైంది.

72 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

ఖరీఫ్‌లో పండించిన ధాన్యం కొనుగోలుకు జిల్లా అధికారులు మొత్తం 72 ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాదిలో 40 వేల టన్నుల ధాన్యాన్ని సేకరించాలని పౌరసరఫరాల అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. జిల్లాలో మొత్తం వరికోతలు పూర్తయ్యాయి. నూర్పులు కన్నా కుప్పలుగానే ఎక్కువగా వేశారు. ఈ ఏడాది 3.5 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. జిల్లాలో 50 రైతు సేవా కేంద్రాలు, 22 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. డిసెంబరు మొదటి వారం నుంచి ధాన్యం సేకరణ చేపట్టారు. గ్రేడ్ 'ఏ' రకం ధాన్యం క్వింటాకు రూ.2,320, సాధారణ రకం అయితే రూ.2,300కు కొనుగోలు చేస్తారు. ధాన్యంలో తేమ శాతాన్ని కొలిచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

జిల్లాలో ధాన్యం కొనుగోలు వివరాలు ఇలా..

జిల్లాలో 3,021 మంది రైతుల నుంచి ఇప్పటి వరకు 9,361 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. రూ.21.08 కోట్ల నగదు వారి ఖాతాల్లో జమ చేశారు.

ధాన్యం నాణ్యతా ప్రమాణాలు ఇలా..

ఏ గ్రేడ్ ధాన్యంలో

- ఎ) వ్యర్థ పదార్థాలు, మట్టి, రాళ్లు ఉంటే -1 శాతం వరకు అనుమతి
- బి) రంగు మారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం- 5 శాతం వరకు అనుమతి
- సి) పరిపక్వం కానటువంటి, ముడుచుకుపోయిన, వంకర తిరిగిన ధాన్యం -3 శాతం
- డి) ధాన్యంలో తేమ శాతం - 17 వరకు అనుమతి
- ఈ) కేళీలు - 6 శాతం

సాధారణ రకం ధాన్యంలో..

- ఎ) వ్యర్థ పదార్థాలు, మట్టి, రాళ్లు ఉంటే -1 శాతం వరకు అనుమతి
- బి) రంగు మారిన, మొలకెత్తిన, పురుగుతిన్న ధాన్యం- 5 శాతం వరకు అనుమతి
- సి) పరిపక్వం కానివి, ముడుచుకుపోయిన, వంకర తిరిగిన ధాన్యం -3 శాతం
- డి) ధాన్యంలో తేమ శాతం- 17 వరకు అనుమతి

ప్రొటోకాల్ రగడ



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు వినతిపత్రం అందజేస్తున్న అనంతగిరి జెడ్పీటీసీ గంగరాజు



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

- ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యం ఇవ్వడం లేదని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ధ్వజం
- మద్దతు తెలిపిన పలువురు జెడ్పీటీసీలు
- కనీస సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం
- నిబంధనలు పాటించని అధికారులపై చర్యలు తీసుకుంటాం: జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర హెచ్చరిక
- వాడీవేడిగా జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట (విశాఖ): ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభ కార్యక్రమాలు, శంకుస్థాపనలకు తమకు ప్రాధాన్యం ఇవ్వకపోవడమే కాకుండా ఎలాంటి ఆహ్వానాలు అందడం లేదని పలువురు జెడ్పీటీసీలు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరిగిన సర్వ సభ్య సమావేశంలో ప్రొటోకాల్‌పై వాడీవేడిగా చర్చ జరిగింది. ఇటీవల అనంతగిరి మండలంలో రోడ్డు శంకుస్థాపన సందర్భంగా నియోజకవర్గ శాసనసభ్యునిగా తనకు ఎలాంటి ఆహ్వానం లేదని, ఇందుకు అధికారుల నిర్లక్ష్యమే కారణమా అని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం నిలదీశారు. కొంతమంది అధికారులు టీడీపీ, బీజేపీ, జనసేన జెండాలు కప్పుకుని తిరుగుతున్నారని విమర్శించారు. ఇలా వారి జెండాలను మోస్తూ ప్రజలతో ఎన్నుకోబడిన తన లాంటి ప్రజాప్రతినిధులను అవమానపరుస్తున్నామని ధ్వజమెత్తారు. ప్రజలతో ఎన్నుకున్న ఎమ్మెల్యేలను కాదని కూటమి నాయకులతో పనులు ప్రారంభించడం ఎంత వరకు సమంజమని ప్రశ్నించారు. అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ ఈ రోడ్డు శంకుస్థాపనకు స్థానిక ఎంపీపీ అయిన తనకు ఆహ్వానం అందలేదన్నారు. కొంతమంది అధికారుల తీరు సరిగ్గా లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం మారగానే కొంత మంది అధికారుల తీరులో కూడా మార్పు కనబడుతోందన్నారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా నిబంధనల మేరకు పనిచేయాల్సి ఉందన్నారు. కాని అధికారపార్టీ ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు చెప్పిన ప్రకారం అధికారులు పనిచేయడం సరికాదన్నారు. గ్రామసభ తీర్మానాల ప్రకారం పనులు చేయాలని, అలాగే మండలపరిషత్, జిల్లాపరిషత్‌లో ఆమోదం ప్రకారం పనులు చేయాల్సి ఉందన్నారు. కాని ఇక్కడ ఎలాంటి తీర్మానాలు లేకుండా పనులు చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని ఆమె స్పష్టం చేశారు. ఇక నుంచి ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గొలుగొండ జెడ్పీటీసీ గిరిబాబు మాట్లాడుతూ కొంత మంది అధికారులు నిబంధనల ప్రకారం పనిచేయకపోవడం వల్ల తాము ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

కక్షసాధింపు అన్యాయం

పింఛనుదారులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం అన్యాయమని గొలుగొండ జెడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు అన్నారు. వారిని ఇబ్బందులు పెట్టేలా సర్వేలు, సదరం సర్టిఫికెట్ల పరిశీలనకు కూటమి ప్రభుత్వం పూనుకోవడం, దీనికి అధికారులు వంత పాడుతున్నారన్నారు. అధికార పార్టీకి ఇలాంటి చర్యలు సరికాదని పలువురు జెడ్పీటీసీలు ఆందోళన వ్యక్తం చేశారు.

బల్క్ డ్రగ్ వద్దు

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద బల్క్ డ్రగ్ ఏర్పాటు చేయడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదురు అవడమే కాకుండా మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారని అనంతగిరి జెడ్పీటీసీ గంగరాజు ఆవేదన వ్యక్తంచేశారు.బల్క్ డ్రగ్ ఏర్పాటును విరమించాలని కోరుతూ జెడ్పీ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేశారు.

అంకిత భావంతో పనిచేయాలి: జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ప్రజా సమస్యలపై అంకిత భావంతో పనిచేయాలని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధికారులను ఆదేశించారు. ఆమె అధ్యక్షతన జరిగిన స్థాయీ సంఘ సమావేశాలు, జెడ్పీ సర్వసభ్య సమావేశంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఆర్థిక ప్రణాళికలు, తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్, వ్యయాలను సభ్యుల ఆమోదంకోసం ప్రవేశపెట్టామన్నారు. జెడ్పీకి సంబంధించి భవనాలు, అతిథి గృహాలు, దుకాణాలు, స్థలాల అభివృద్ధిపై సూచనలు, సలహాలు సభ్యుల నుంచి కోరారు. ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధ్యయనం చేసేందుకు సభ్యులను తీసుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తామన్నారు. జెడ్పీ సీఈవో నారాయణమూర్తి మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో జెడ్పీకి సంబంధించి 19 అతిథి గృహాలు ఉన్నాయని, వీటిలో కొన్నింటికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తెస్తామన్నారు. నిర్వహణకు ఇబ్బందులు లేకుండా నిధులు మంజూరు చేస్తామన్నారు. ఆదాయ వనరులు పెంచుకునేలా సభ్యులు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, చిత్రంలో సీఈవో నారాయణమూర్తి

అంచనా బడ్జెట్‌కు ఆమోదం

అనంతరం 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరణ బడ్జెట్, 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా ఆదాయం రూ.1589కోట్ల 13లక్షల 81వేల 635, అంచనా వ్యయం రూ.1586కోట్ల 08లక్షల, 58వేల 235కు సంబంధించి సభ్యులు ఆమోదం తెలిపారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీడీ విజయకుమార్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

గొట్టివాడ ఇసుక రీచ్‌లో తవ్వకాలు నిలిపివేత



గొట్టివాడ ఇసుక రీచ్‌లో తహసీల్దారు తిరుమలబాబు

సాక్షి ఎఫెక్ట్..

కోటవురట్ల: 'వరాహనదిలో ఇసుక తోడేళ్లు' శీర్షికన సాక్షి దినపత్రికలో ఈ నెల 7వ తేదీన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు శాఖాధికారులు సంయుక్తంగా ఈ నెల 12న గొట్టివాడ ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఇందుకు సంబంధించి తహసీల్దారు తిరుమలబాబు వివరణ ఇచ్చారు. గొట్టివాడ ఇసుక రీచ్‌ను పరిశీలించిన రోజున ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న 4 ట్రాక్టర్లను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. ఇందులో ఒక ట్రాక్టరుకు రూ.5 వేలు అపరాధ రుసుం చెల్లించగా మిగిలిన 3 ట్రాక్టర్లు పోలీసు స్టేషన్‌లో ఉంచామని తెలిపారు. కాగా గతంలో రాష్ట్ర ప్రభుత్వ ఉచిత ఇసుక పాలసీలో భాగంగా గొట్టివాడ, పందూరు ఇసుక రీచ్‌లలో ఇసుక లభ్యత ఎక్కువగా ఉన్నందున తవ్వకాలకు అనుమతి ఇచ్చామన్నారు. తాజాగా ఈనెల 16న మరోసారి పరిశీలించగా గొట్టివాడ ఇసుక రీచ్‌లో ఇసుక లభ్యత లేకపోవడంతో ఎటువంటి ప్రభుత్వ అవసరాలకు గాని, వ్యక్తిగత అవసరాలకు గాని ఇసుకను తీయడానికి వీలులేకుండా అనుమతులు రద్దు చేసినట్టు తెలిపారు. ఇసుక ఉచిత విధానంలో ప్రభుత్వ అభివృద్ధి పనులు, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యక్తిగత ఇళ్ల నిర్మాణాల కోసం దరఖాస్తు చేసిన వారికి మాత్రమే అర్హత ప్రకారం అనుమతి ఇస్తామని పేర్కొన్నారు. అక్రమ రవాణా జరగకుండా ఉండేందుకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ, గ్రామ రెవెన్యూ సహాయకులు ఇసుక రీచ్‌ల వద్ద విధులు నిర్వహిస్తారని తెలిపారు. ఎటువంటి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

సాంకేతికతతో ముందడుగు

కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్ సౌత్ జోన్–2 సదస్సు ప్రారంభం

8లో

చల్లగా చూడు.. గౌరమ్మ తల్లీ..



వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, (ఇన్‌సెట్) గౌరీ పరమేశ్వరులు



అనకాపల్లి: వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి మహోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయమే ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవాలకు అంకుర్పారణ చేశారు. అమ్మవారి మహోత్సవానికి రెండు నెలల ముందుగా పట్టణంలో పలు ప్రాంతాల్లో నేలవేషాలు, స్టేజ్ ప్రొగ్రాములు, సంస్కృతిక కార్యక్రమాలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం తెల్లవారుజాము నుంచి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఉదయం 9 గంటలకు అమ్మవారి రథంపై ఉంచి పట్టణంలో పురవీధులు గుండా సోమవారం తెల్లవారు జాము వరకూ ఊరేగిస్తున్నారు. సాయంత్రం అమ్మవారి నేల వేషాలు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారులు జనంతో కిక్కిరిసిపోయ్యాయి. ఈ మహోత్సవానికి సుమారుగా 3 లక్షల మంది ప్రజలు వస్తారని అంచనా వేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వాకాడ బాబు పర్యవేక్షించారు. అమ్మవారి ఉత్సవాన్ని పురస్కరించుకుని వేల్పులవీధిలో, అమ్మవారి ఆలయం వద్ద పలు సంఘాల ప్రతినిధులు పులిహోర, కిచిడి, సత్యనారాయణస్వామి ప్రసాదాలు ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉత్సవానికి వచ్చే భక్తులకు పంపిణీ ప్రసాదాలు చేశారు.



ఆకట్టుకున్న నేల వేషాలు



అమ్మవారి ఉత్సవంలో కిక్కిరిసిన భక్తులు

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


కోదండ రామునాయుడు (ఫైల్)

కశింకోట:మండలంలోని పల్లపు సోమవారం గ్రామంలో కుంచ కోదండ రామునాయుడు(40) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. అందిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. వివరాలు... డ్రైవర్ పని కోసం గత ఏడాది అక్టోబర్ 29న ఇంటి వద్ద చెప్పి రామునాయుడు బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లేకపోవడంతో తండ్రి కుంచ పెద్ద జోగునాయుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్మీ ఉద్యోగి ఆత్మహత్య


భరత్(ఫైల్)

మాకవరపాలెం: ప్రేమించిన యువతి దక్కదన్న మనస్తాపంతో ఓ ఆర్మీ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో మండలంలోని బూరుగుపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ గ్రామానికి చెందిన గూనూరు భరత్(22) ఏడాది క్రితం అగ్నివీర్ ఎంపికల్లో ఆర్మీ ఉద్యోగం పొందాడు. ఐదు నెలల కిందట శిక్షణ ముగించుకుని, వెస్ట్ బెంగాల్ లో ఉద్యోగం చేస్తున్నాడు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఓలాడ్జీలో ఆత్మహత్య చేసుకున్నట్టు శనివారం కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఓ యువతిని ప్రేమించానని, ఆమెకు వేరే యువకుడితో వివాహం చేస్తుండడంతో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్టు స్నేహితులకు తెలిపినట్టు స్థానికులు తెలియజేశారు. మృతుడి తల్లి మరణించగా, తండ్రి తాతారావు బూరుగపాలెంలో కూలి పనులు చేస్తుంటాడు. చేతికి అంది వచ్చిన కొడుకు మృతితో తండ్రి భోరున విలపిస్తున్నాడు.

నేడు కనకమహాలక్ష్మి జాతర

- భారీగా ఏర్పాట్లు
- లక్షమందికి పైగా తరలివస్తారని అంచనా
- విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న పట్టణం
- 100 మందితో పోలీసు బందోబస్తు


కనకమహాలక్ష్మి అమ్మవారు



యలమంచిలి రూరల్: భక్తజన కల్పవల్లిగా ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రసిద్ధి చెందిన యలమంచిలి ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు.ప్రతి ఏటా మార్గశిరమాసోత్సవాలు ముగిసిన తర్వాత అమ్మవారి జాతరను నిర్వహించడం ఆనవాయితీ.


ఆహ్లాదాన్నిచ్చే రియల్ డ్యాన్స్

ఈ జాతరకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి లక్ష మందికి పైగా జనం వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.ఇందుకనుగుణంగా ధర్మవరంలో అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించారు.

భారీ పోలీసు బందోబస్తు

జాతరకు తరలివచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా యలమంచిలి పట్టణంలో ఎలాంటి గొడవలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.యలమంచిలి సీఐ ధనుంజయరావు ఆధ్వర్యంలో ఎనిమిది మంది ఎస్‌ఐలు,15 మంది ఏఎస్‌ఐలు,సుమారు 100 మంది పోలీసులు బందోబస్తులో భాగస్వాములు కానున్నారు. పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ బందోబస్తును పర్యవేక్షించనున్నారు.ముఖ్యంగా పోకిరీల వేధింపులు,చైన్ స్నాచింగ్‌లు వంటివి జరగకుండా మఫ్టీలో పోలీసులు నిఘా ఉంచనున్నారు.జాతరలో అల్లర్లకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని యలమంచిలి సీఐ ధనుంజయరావు స్పష్టం చేశారు.

భారీ విద్యుత్ దీపాల సెట్టింగ్‌లు

జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆలయం, చుట్టుపక్కల రహదారులు,యలమంచిలి ప్రధాన రహదారికిరువైపులా విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా భారీ సెట్టింగులు ఏర్పాటు చేశారు. దేవతామూర్తుల రూపాలతో విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన కటౌట్లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.అమ్మవారి జాతరలో భాగంగా స్థానిక రాజీవ్ క్రీడామైదానంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. జెయింట్‌వీల్,రంగులరాట్నం,డ్రాగన్ ట్రెన్,రియల్ డ్యాన్స్,పిల్లలకోసం గుర్రపు స్వారీ,ప్రత్యేక ఆటలు వంటివి ఇక్కడ సిద్ధం చేశారు.ఇవికాకుండా కోలాటాలు,స్టేజీ ప్రోగ్రాంలు, బుర్రకథ, హరికథ, సంప్రదాయ నృత్యప్రదర్శనలు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా ఉండనున్నాయి.పలువురు వీఐపీలు, ప్రముఖులు,వ్యాపారులు,ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకోనుండడంతో అందుకు తగినట్లుగా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది.జాతరను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు శనివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కోరారు. ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కొటారు సాంబ,కొటారు నరేష్,మడగల సత్యనారాయణ,పిల్లా రాము,ప్రసాద్,అల్లిమళ్ల రాజు,పలువురు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్ కార్మికుల సమ్మె విరమణ

రెండు రోజుల్లో రెగ్యులర్ క్రషింగ్ ప్రారంభమయ్యే అవకాశం

చోడవరం: గోవాడ చక్కెర కర్మాగారం కార్మికులు ఎట్టకేలకు సమ్మె విరమించారు. జీతభత్యాల బకాయిలు చెల్లించాలంటూ వారం రోజులుగా నిరవధిక సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడు, ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు కార్మికులతో పలుమార్లు చర్చలు జరిపి.. ఎట్టకేలకు వారం రోజుల్లో కొంతమేర చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దాంతో కార్మికులు సమ్మెను విరమించి శనివారం నుంచి విధులకు హాజరయ్యారు. ఈనెల 16వ తేదీ నుంచి జరగాల్సిన రెగ్యులర్ క్రషింగ్‌కు కార్మికుల సమ్మె కారణంగా కొంత అంతరాయం ఏర్పడింది. ఇప్పుడు సమ్మె విరమించడంతో క్రషింగ్ ప్రారంభించేందుకు యాజమాన్యం అన్ని చర్యలు చేపట్టింది. ఇప్పటికే రైతులకు కటింగ్ పర్మిట్లు ఇచ్చేయడంతో వారు కూడా చెరకును ఫ్యాక్టరీకి సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. దీంతో రెండ్రోజుల్లో రెగ్యులర్ క్రషింగ్ ప్రారంభించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఆలస్యం కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా నిరవధికంగా క్రషింగ్ చేసి సీజన్‌ను ముగించే విధంగా యాజమాన్యం ప్రణాళిక సిద్ధం చేసుకుంది. ఇదిలావుండగా ఫ్యాక్టరీకి ఏపీ ట్రాన్స్‌కో నుంచి, విశాఖ డెయిరీ నుంచి రావలసిన సుమారు రూ.7 కోట్లు వసూలు చేయగలిగితే సమస్యలన్నీ తీరిపోతాయని, స్థానిక ఎమ్మెల్యే దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు, కార్మికులు అంటున్నారు.

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

జాయింట్ కలెక్టర్ జాహ్నవి


మాడుగులలో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛదివస్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి తదితరులు


ఎస్పీ కార్యాలయం ఆవరణలో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న అదనపు ఎస్పీ దేవప్రసాద్, పోలీస్ సిబ్బంది


కలెక్టరేట్ పరిసరాలను శుభ్రం చేస్తున్న డీఆర్వో సత్యనారాయణరావు

మాడుగుల: పరిసరాలను పరిశుభ్రత సామాజిక బాధ్యత అని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో కొంకి అప్పారావు ఆధ్వర్యంలో ప్రారంభించిన స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు, బస్టాండ్‌లు, ఇతర స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం స్వచ్ఛత పాటిస్తామని, మండల స్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బందితో పాటు, ప్రజా ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. సంత ప్రాంతం, బస్టాండ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో కొంకి అప్పారావు, సర్పంచ్ ఎడ్ల కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయం వద్ద..

అనకాపల్లి: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రతిజ్ఞచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, సీఐ టి.లక్ష్మి, ఎస్‌ఐలు రమణయ్య, వెంకన్న, ఆదినారాయణ, కామేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ...

తుమ్మపాల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని, ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని డీఆర్వో వై.సత్యనారాయణరావు తెలిపారు. స్వచ్ఛాంధ - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఆయనతో పాటు పలు శాఖల జిల్లా అధికారులు శనివారం కలెక్టరేట్ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడవ శనివారం కార్యాలయాలు, పాఠశాలలు, ఆస్పత్రుల్లో పట్టణాలు, పల్లెల్లో ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఏడాది పాటు నిరంతరాయంగా కొనసాగనున్న కార్యక్రమంలో పంచాయతీ రాజ్, గ్రామీణఅభివృద్ధి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలు.. మిగిలిన శాఖల సమన్వయంతో ప్రధాన భూమిక పోషించాలని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో మానవహారాన్ని నిర్వహించి, ప్రతిజ్ఞలు చేయించాలన్నారు. అంతకు ముందు జిల్లా అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యాలయ ప్రాంగణం, పరిసరప్రాంతాలలో గల తుప్పలు, పొదలు తొలగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో...

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో డీఎంహెచ్‌వో పడాల రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా ఒక్కో థీమ్‌తో కార్యక్రమాలను చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ నెల న్యూ ఇయర్-క్లీన్ స్టార్ట్ నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు చెప్పారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.


స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో పడాల రవికుమార్

సాంకేతికతతో ముందడుగు

- కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్
- సౌత్ జోన్-2 సదస్సు ప్రారంభం


మాట్లాడుతున్న కర్నాటక హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి అను శివరామన్


మాట్లాడుతున్న జస్టిస్ సీఎం జోషి

విశాఖ లీగల్: శరవేగంతో విస్తరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం న్యాయవ్యవస్థలో కూడా అభివృద్ధి చెందాలని కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్ అన్నారు. శనివారం మధ్యాహ్నం బీచ్‌రోడ్డులోని ఆంధ్ర విశ్వకళా పరిషత్ కన్వెన్షన్ సెంటర్లో జాతీయ, ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన సౌత్ జోన్-2 సదస్సులో న్యాయస్థానాల్లో వాజ్యాల జాబితా అన్వేషణ, మినహాయింపు అన్న అంశంపై న్యాయ నిపుణులు ప్రసంగించారు. ఏడు రాష్ట్రాలకు చెందిన హైకోర్టు, జిల్లా కోర్టు, ఇతర కోర్టుల న్యాయమూర్తులు సదస్సుకు హాజరయ్యారు. సుప్రీంకోర్టు, హైకోర్టు నుంచి 25 మందికి పైగా న్యాయకోవిదులు పాల్గొన్నారు. న్యాయ వ్యవస్థలో సాంకేతిక తీరుతెన్నులు-భవిష్యత్తులో మార్పులపై కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ అనూ శివరామన్ ప్రసంగించారు. డిజిటల్ సాంకేతికత న్యాయవ్యవస్థతో అనుసంధానం కావాల్సిన అవసరం ఉందన్నారు. నేడు ప్రతి రంగంలోనూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తరించిన నేపథ్యంలో న్యాయస్థానాల్లో కృత్రిమ మేధస్సు, డిజిటల్ సాంకేతికత చూపించాలని స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా న్యాయవాదులు, న్యాయమూర్తులు సిబ్బంది తమ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. సోషల్ మీడియా -సాధారణ మీడియాపై మధ్య సంబంధం లేదని స్పష్టం చేస్తూ ఇటీవల కాలంలో ఈ మీడియాల వల్ల వస్తున్న సమస్యలను విశదీకరించారు. డిజిటల్ సంతకాలు నైపుణ్యం కలిగిన న్యాయవాదులు, న్యాయమూర్తులు రేపటి భవితకు మార్గదర్శకులుగా నిలుస్తారన్నారు. 2015 నాటికి సాంకేతికపరమైన అంశాలకు సంబంధించి ఓ పుస్తకంలో అంశాలను ఆమె వివరించారు.

న్యాయ స్థానాల్లో జవాబుదారీతనం కీలకం

న్యాయస్థానాల్లో జవాబుదారీతనం చాలా కీలకమైందని కర్ణాటక హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, ఈ కోర్టుల పర్యవేక్షకులు జస్టిస్ సీఎం జోషి పేర్కొన్నారు. సాంకేతికత పేరుతో ముందుకెళుతున్న న్యాయస్థానాలు అంతర్గత మార్పులకు ముందడుగు వేయాలన్నారు. చలానా, ఫైన్ కేసులు సైతం విపరీతమైన జాప్యానికి ఎవరు కారణమనేది ప్రశ్నించుకోవాలన్నారు. కేసులకు సంబంధించి ప్రత్యామ్నాయ పరిష్కార వివాద యంత్రాంగ సేవలను పొందాలని కూడా సూచించారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. ఇటీవల కేరళ హైకోర్టు పర్యవేక్షణలో జరిగిన ఈ కోర్టుల విధానాన్ని వివరించారు. వర్చువల్ విధానంలో కేసులు విచారణకు కేరళ హైకోర్టు తీసుకున్న చర్యలను జస్టిస్ సీఎం జోషి వెల్లడించారు. 30 మంది హైకోర్టు న్యాయమూర్తులు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ జూనియర్ సివిల్ జడ్జీలు, మేజిస్ట్రేట్లు, ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ హరినాథశర్మ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కుష్ఠువ్యాధిపై ఇంటింటి సర్వే


అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో పడాల రవికుమార్


పాల్గొన్న వైద్యులు, వైద్య సిబ్బంది

అనకాపల్లి: జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకూ నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌వో పడాల రవికుమార్ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలో జిల్లాలో పీహెచ్‌సీ, సీహెచ్‌సీల వైద్య సిబ్బందికి శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో విడత కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరీక్షించి, ఎవరికైనా కుష్ఠువ్యాధి లక్షణాలు ఉన్నట్టయితే సకాలంలో వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అంతకుముందు డిజిటల్ బోర్డుపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుష్ఠువ్యాధి నిర్మూలన అధికారి ఎం.ఎస్.వి.కె.బాలాజీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శతశాతం లక్ష్యాలు పూర్తి చేయాలి

డీఎంహెచ్‌వో రవికుమార్


హరిపాలెం ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి రవికుమార్


తిమ్మరాజుపేట సబ్‌సెంటర్‌లో వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

అచ్యుతాపురం: ఆరోగ్య,వైద్య శాఖకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను,లక్ష్యాలను శతశాతం పూర్తి చేయాలని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి పి.రవికుమార్ ఆదేశించారు.అచ్యుతాపురం మండలం హరిపాలెం పీహెచ్‌సీని ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు.రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మందుల నిల్వ, టీకాల లభ్యత వివరాలు తెలుసుకున్నారు.పెదపాడులో నిర్వహిస్తున్న ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి విజయ్, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్,ఆరోగ్య బోధకులు రామలక్ష్మి,ఆరోగ్య పర్యవేక్షకులు సునీత,ఉమా మహేశ్,సిబ్బంది గణేశ్,శాంతి తదితరులు పాల్గొన్నారు.

సబ్ సెంటర్ సందర్శన ..

మునగపాక: మండలంలోని చూచుకొండ పీహెచ్‌సీ పరిధిలోని తిమ్మరాజుపేట సబ్‌సెంటర్‌ను శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పి.రవికుమార్ సందర్శించారు. కేంద్రంలోని మందుల విభాగాన్ని పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. కేంద్రం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సబ్‌సెంటర్‌కు వచ్చే ప్రతి ఒక్కరికీ సకాలంలో సేవలందించేలా వైద్యసిబ్బంది కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఆయన వెంట హెచ్‌ఎస్ లక్ష్మణ్ ఉన్నారు.

క్లుప్తంగా

ధ్యాన వేంకటేశ్వరస్వామి అలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారు శనివారం భక్తులను కనువిందు చేశారు. వజ్ర కవచాలంకృతంతోపాటు పూలమాలలు, తులసి మాలలతో అందంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. 108 దీపాలతో నక్షత్ర హారతి ఇచ్చారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

నేడు కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రవచనం

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆవరణలో ఆలయ ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ఏలూరుకు చెందిన వద్దివర్తి పద్మాకర్ వారితో ''మానవుడు మాధవుడు'' అనే అంశంపై ప్రవచనం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 4 నుంచి 8వ తేదీ వరకూ నిర్వహించే శతజయంతి ఉత్సవాల సందర్భంగా భూరి విరాళాలు ఇచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

ఘనంగా సీతారాముల తీర్థం

కశింకోట: మండలంలోని జోగారావుపేట, గొబ్బూరు గ్రామాల్లో శనివారం సీతారాముల తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తినుబండారాలు, ఆట వస్తువుల అమ్మకాలు జోరుగా సాగాయి. తోడపెద్దు సేవలు నిర్వహించారు. జోగారావుపేటలో తీర్థ మహోత్సవంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీశెట్టి రామకృష్ణ (రాంకీ) పాల్గొని రామాలయంలో పూజలు చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆనకట్టకు మరమ్మతులు చేయాలని వినతి

కశింకోట: ఏఎస్ పేట వద్ద శారదానదిపై ఉన్న నరసాపురం ఆనకట్ట తలుపుల నుంచి నీరు లీక్ కాకుండా మరమ్మతులు చేపట్టాలని ఆనకట్ట సాగునీటి సంఘం చైర్మన్ ఉప్పలూరి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు శనివారం నీటిపారుదల శాఖ డీఈ సాయి ప్రశాంతిని కలిసి విన్నవించారు. పంట కాలువలకు మరమ్మతులు చేపట్టి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని కోరారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించారన్నారు. ఏఈ రామకృష్ణ, సంఘం డైరెక్టర్లు గొంతిన పెదరాయుడు, తాడి లచ్చబాబు, పీలా నాగేష్ పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 2,602 దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,300	5,480
మొదటి రకం	3,750	4.380
రెండో రకం	3,180	3,700
మూడో రకం	2,900	3,160

అనకాపల్లి సినిమాలు

దాకు మహారాజ్	: రాజా
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
సంక్రాంతికి వస్తున్నాం	: సత్యనారాయణ స్క్రీన్-2
గేమ్ ఛేంజర్	: పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	: షిర్డీసాయి
గేమ్ ఛేంజర్	: వెంకటేశ్వర
సంక్రాంతికి వస్తున్నాం	: శ్రీసత్య
దాకు మహారాజ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 55 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-29 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 393 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 346 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.



కశింకోట వద్ద మడుల్లో నూర్పుడుకు సిద్ధంగా వరి కుప్పలు

ధాన్యం కొనుగోలు చేసేదెన్నడో?

- కళ్లాలకు వెళ్లి కొనుగోలు చేయని అధికారులు
- దళారులకు తెగనమ్ముకుంటున్న రైతులు
- గిట్టుబాటు లేక నష్టపోతున్న వైనం

కశింకోట: మండలంలో ధాన్యం కొనుగోళ్లు ఇంకా ప్రారంభం కాలేదు. అధికారులు కొనుగోలుకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్నప్పటికీ ఏ ఒక్క రైతు వద్దకు వెళ్లిన దాఖలాలు లేవు. దాంతో రైతులు దళారులకు తెగనమ్ముకుని ఆర్థికంగా నష్టపోతున్నారు. మండలంలో గతేడాది ఖరీఫ్ సీజన్‌లో 1,360 హెక్టార్లలో వరి పంట వేశారు. అది పండటంతో కోతలు కోసి కుప్పలు పెట్టారు. ఖరీఫ్ కాలంలో వరుస తుపాన్ల వల్ల పలుచోట్ల పంట నేలకొరిగి, నీట తడిచి దెబ్బతిని నష్టం కలిగినప్పటికి మిగిలిన పంటను కూడదీసుకొని వరి కుప్పలుగా పెట్టుకొని భద్రపరిచారు. వర్షాలకు తడిచిన పంటను అవకాశం ఉన్నంత మేరకు కూడదీసుకునే ప్రయత్నం చేశారు. కొందరు నష్టపోయారు. ఎక్కువ మంది కుప్పలు పెట్టి నూర్పిడికి కూలీలు దొరక్క నూర్పడానికి సన్నద్ధమవుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లపై కానరాని ప్రచారం

ఈ నేపథ్యంలో ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ద్వారా ధాన్యం కొనుగోలుకు సిద్ధమైంది. ఇందుకు కొనుగోలు ధర క్వింటాకు రూ.2,300 నిర్ణయంతో పాటు పలు నిబంధనలు విధించింది. ధాన్యం అమ్మకానికి నిర్ణయించుకున్న రైతు ముందుగా వ్యవసాయ శాఖ కార్యాలయానికి వచ్చి తన సమ్మతి తెలపాలి. అధికారులు అనుమతి మేరకు ధాన్యం తెచ్చి తేమ, నాణ్యత పరీక్షను నిర్వహించాలి. ఈ నేపథ్యంలో ధాన్యం నాణ్యత నిర్ధారించి కొనుగోలుకు అనుమతి లభిస్తే వారం రోజుల వ్యవధిలో వాటిని రైతు నుంచి నేరుగా కళ్లాల వద్దకు పౌర సరఫరాల శాఖ అధికారులు సాంకేతిక నిపుణులతో వచ్చి నిబంధనల మేరకు కొనుగోలు చేస్తారు. వాటిని వాహనంలో జీపీఎస్ యంత్రం సహాయంతో నేరుగా మిల్లుకు చేరుస్తారు. రైతు నుంచే నేరుగా పరిశీలించి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆధారం కోసం ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత రెండు రోజులకు రైతు బ్యాంకు ఖాతాకు చెల్లింపులు జరుపుతారు. వంద కిలోల బస్తా ధాన్యానికి రూ.2,300 ప్రభుత్వం కొనుగోలు ధరగా నిర్ణయించింది. ప్రభుత్వం గుర్తించిన రకాలైన ఆర్జీఎల్, సాంబ మసూరి, సోనా మసూరి తదితర రకాల ధాన్యాన్ని కొనుగోలు చేయనుంది. ఇంతటి ప్రక్రియ జరిగితే ధాన్యం అమ్మకం పూర్తి అవుతుంది. రైతులు సమకూరిస్తే గోనెలు, రవాణా, కూలీ ఖర్చును కూడా ధాన్యం ధరతోపాటు అదనంగా చెల్లించనున్నారు. దీనిపై గ్రామాల్లో అధికారులు ప్రచారం చేయడంగానీ అవగాహన కల్పించకపోవడంతో దళారులకు అమ్ముకుంటున్నారు.

> **రైతులు ఇంకా ముందుకు రాలేదు**
>
> మండలంలో వరి ధాన్యం అమ్మకానికి రైతులు ఇంకా ముందుకు రాకపోవడం వల్ల కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. తమ శాఖ ద్వారా అమ్మకానికి సిద్ధంగా ఉన్న రైతుల వివరాలు, ధాన్యం నిల్వల గురించి పౌర సరఫరాల శాఖకు ఆన్‌లైన్ ద్వారా తెలియజేస్తాం. దీంతో పౌర సరఫరాల శాఖ వారు సాంకేతిక సిబ్బందితో వచ్చి నేరుగా కళ్లాల నుంచి కొనుగోలు చేస్తారు. ఇందుకు రైతు ఎటువంటి ఖర్చు భరించాల్సిన అవసరం లేదు. ఒకవేళ ఎక్కడైనా గోనెలు, రవాణా, కూలీల ఖర్చు భరించాల్సి వచ్చినా దాన్ని ధాన్యం కొనుగోలు ధరతోపాటు చెల్లిస్తారు. తుపాన్ల ప్రభావం వల్ల తడిచి రంగు మారిన ధాన్యాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు కొనుగోలు చేయనున్నారు.
>
> – ఎం. స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట

కళ్లాల్లో వాలిపోతున్న దళారులు...

ఈ ఏడాది వరుస తుపానులతో పంట కొన్నిచోట్ల దెబ్బతిని నష్టం వాటిల్లింది. ధాన్యం కూడా తడిచాయి. ఈ నేపథ్యంలో రంగు మారిన ధాన్యాన్ని నిబంధనల మేరకు కొనుగోలు చేయడానికి కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు అధికారులు సమాయత్తమయ్యారు. అయినా రైతులు మొగ్గు చూపడం లేదు. ప్రైవేటు వ్యాపారులు నేరుగా కళ్లలకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ధర కాస్త తక్కువ అయినా నాణ్యత, తేమ శాతాన్ని పరిశీలించి కొనుగోలు చేయడం, వాటికి వెంటనే చెల్లింపులు చేస్తుండటంతో ఆసక్తి చూపుతున్న పరిస్థితులున్నాయి. అంతేకాకుండా మండలంలోని రైతులు అత్యధిక శాతం మంది సన్న, చిన్న కారు రైతులే. దీనివల్ల తమ ఇంటి అవసరాలకు సరిపడిన మేరకు వరి పండిస్తారు. పెద్ద రైతులు మాత్రం ఎక్కువగా పండించే ధాన్యాన్ని అమ్మకం చేస్తారు. వారంతా వరి పంట కోసి కుప్పలుగా నిలిపారు. వాటిని నూర్చాల్సి ఉంది. సంక్రాంతి తర్వాత ఎక్కువగా నూర్పిడిలు జరుగుతాయి. అప్పటి వరకు ధాన్యం అమ్మకానికి రాకపోయే పరిస్థితి ఉంది. ఇక గత ఏడాది ధాన్యం ఇవ్వడానికి రైతులు ముందుకు రాకపోవడంతో కొనుగోళ్లు జరగలేదు. ఈ ఏడాది అదే పరిస్థితి పునరావృతం అవుతుందా? ఎవరైనా రైతులు అమ్మకానికి ముందుకు వస్తారా? అని అధికారులు ఎదురు చూస్తున్నారు.

రేపటి నుంచి రీసర్వే ప్రారంభం



భూముల రీసర్వేపై ర్యాలీ చేస్తున్న తహసీల్దారు విజయకుమార్, రెవెన్యూ సిబ్బంది

తుమ్మపాల: ప్రభుత్వం చేపడుతున్న రీసర్వేతో పూర్తి హక్కులతో భూమి పత్రాలను పొందవచ్చని తహసీల్దార్ విజయకుమార్ అన్నారు. శనివారం కొండుపాలెంలో భూముల రీసర్వే- గ్రామసభ ద్వారా అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పైలట్ ప్రాజెక్టు కింద ఈ నెల 20 నుంచి గ్రామంలో రీసర్వే ప్రారంభం అవుతుందన్నారు. ప్రజలందరి పూర్తి సహకారంతో సమస్యలు లేకుండా రీసర్వే విజయవంతం చేయాలన్నారు. రీసర్వే చేపట్టడం ద్వారా రైతులకు తమ భూములపై సమస్యలు లేనివిధంగా ప్రభుత్వం హామీతో హక్కు పత్రాలు అందిస్తామన్నారు. భూమి కలిగిన ప్రతి ఒక్కరూ సర్వే సమయంలో తమ భూమి వద్దకు సంబంధిత పత్రాలతో హాజరు కావాలన్నారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, మండల సర్వేయర్ మోహన్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటర్లుగా 530 మంది ఉపాధ్యాయుల నమోదు



ఓటర్ల జాబితాను ఆవిష్కరిస్తున్న కొణతాల గణేష్

అనకాపల్లి: టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉపాధ్యాయులు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉండాలని, అనకాపల్లిలో 530 మంది ఓటర్లు ఎన్‌రోల్‌మెంటు అయ్యారని ఏపీటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు కొణతాల గణేష్ తెలిపారు. స్థానిక నర్సింగరావుపేట ఏపీటీఎఫ్ భవనంలో శనివారం జరిగిన సమావేశంలో ఓటరు జాబితాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏపీటీఎఫ్ అభ్యర్థిగా పాలకపాటి రఘువర్మ పోటీలో ఉన్నారని, అత్యధిక మెజార్టీతో గెలిపించుకునే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఓటరుగా నమోదైన ఉపాధ్యాయుల గృహాలకు వెళ్లి ఓటరు స్లిప్స్ అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు సత్యం, సాంబమూర్తి, నాయకులు శివాజీ, జగదీష్, కన్నారావు, బలరాం, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

52 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



పరీక్షలు చేస్తున్న హోమి బాబా క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు

తుమ్మపాల: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని, పరిశుభ్రమైన ఆహారంతో పాటు మంచి వాతావరణంలో జీవించాలని హోమి బాబా క్యాన్సర్ ఆస్పత్రి సీఎంవో డాక్టర్ నమిత, రేడియేషన్ అంకాలజీ డాక్టర్ సునీత తెలిపారు. రేబాక పంచాయతీ కాపుశెట్టివానిపాలెం గ్రామంలో తుమ్మపాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో హోమి బాబా క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. గొంతు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. బీపీ, మధుమేహ తనిఖీలు నిర్వహించారు. 52 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ షామీమ్, ఎంఎల్‌హెచ్‌పీ గాయత్రి, సాంకేతిక సిబ్బంది వరలక్ష్మి, అనిల్, వెంకటలక్ష్మి, మంగ, సంధ్య, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హరిదాసు కానుకల స్వీకరణ



గవరపేటలో హరిదాసు అప్పలకొండ ఆశీస్సులు

కశింకోట: ధనుర్మాసం రోజుల్లో సంచరించి హరినామస్మరణతో భక్తి పారవశ్యాన్ని నింపిన హరిదాసు మాడా అప్పలకొండ ఇంటింటికీ తిరిగి భక్తుల నుంచి బియ్యం, నగదు దక్షిణ రూపేణా దానాల సేకరణ చేపట్టారు. దీనిలో భాగంగా శనివారం గవరపేటలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ధనుర్మాసంలో అక్షయపాత్ర తలపై పెట్టుకొని సితార తీగలు మీటుతూ హరి నామస్మరణతో వీధుల్లో తిరిగి భక్తులు వేసే బియ్యం, నగదు వగైరా సేకరించారు. ధనుర్మాసం ముగియడంతో వీధుల్లో తిరిగి భక్తిభావంతో ఆసక్తి కలిగిన భక్తులు, ధనుర్మాస సమయంలో దానం చేయడానికి అవకాశం లేని వారు తమ కుటుంబ సభ్యులతో భక్తిభావంతో అందించే బియ్యం, దక్షిణ, వస్త్రాలు వగైరా దానంగా సేకరిస్తున్నారు. భక్తులు హరిదాసు నుంచి ఆశీర్వాదాలు తీసుకుంటున్నారు. సేకరించిన వాటిలో కొంత భాగాన్ని కుటుంబ పోషణకు, మరికొంత భాగం భద్రాచలంలో జరిగే శ్రీరామనవమి సీతారాముల కల్యాణోత్సవాలకు అందజేయనున్నట్లు హరిదాసు ఈ సందర్భంగా తెలిపారు. అచ్యుతాపురం మండలం కొండకర్ల గ్రామానికి చెందిన తన తాత, తండ్రుల నుంచి వారసత్వంగా 1982 నుంచి హరిదాసు వృత్తిని తాను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కశింకోటలో మాత్రం మూడేళ్ల నుంచి ఈ వృత్తిని నిర్వహిస్తున్నానన్నారు. యాదవ కులానికి చెందిన తాను హరినామస్మరణతో భక్తి, ముక్తి కోసం ఈ వృత్తిని నిర్వహిస్తున్నానని చెప్పారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



కశింకోటలో రిక్షా కార్మికులకు తువ్వాళ్ల పంపిణీ

కశింకోట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎన్టీ రామారావు, బసవరామతారకం దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి పలువురు ఘన నివాళులర్పించారు. రిక్షా కార్మికులకు తువ్వాళ్లను పంపిణీ చేశారు. రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవిందసత్యనారాయణ, జనసేన నాయకుడు భీశెట్టి రాంకీ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, కూటమి నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు. ఇతర గ్రామాల్లోనూ ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు ఆంధ్ర ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధి జంక్షన్ వద్ద టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పట్టణ ఎన్టీఆర్ ఫాన్స్ అభిమానులు శనివారం నివాళులర్పించారు. ఫాన్స్ పట్టణ అధ్యక్షుడు వేదుల రామారావు మాట్లాడుతూ తెలుగుజాతి ఆత్మ గౌరవాన్ని చాటిచెప్పిన మహానీయుడు అడుగుజాడల్లో నేటి యువత నడవాలని కోరారు.

పారదర్శకంగా అప్పన్న నగల పరిశీలన

- దేవదాయ శాఖ జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు



రికార్డులు పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారి పల్లంరాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జ్యూయలరీ వెరిఫికేషన్ పారదర్శకంగా జరుగుతోందని రాష్ట్ర దేవదాయ శాఖ జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు తెలిపారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి దాతలు కానుకగా సమర్పించిన బంగారు, వెండి, ఇతర విలువైన వస్తువుల రికార్డులను రెండవ రోజు శనివారం పల్లంరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి బంగారం తాలూకా రికార్డులను ఇప్పటి వరకు పరిశీలించామని, మరో మూడు రోజుల పాటు వెండి వస్తువుల రికార్డుల పరిశీలన ఉంటుందన్నారు. రికార్డులు వెరిఫికేషన్ పూర్తి కాగానే ఒక్కో వస్తువుని తనిఖీ చేసి దానికి సంబంధించిన రికార్డు ఉందో లేదో పరిశీలిస్తామన్నారు. మరో పది రోజుల పాటు ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఏమాత్రం తేడా వచ్చినా కచ్చితంగా రికార్డు చేస్తామన్నారు. నివేదికను దేవదాయ శాఖ కమిషనర్‌కి పంపిస్తామన్నారు. అదే నివేదికను మీడియాకు కూడా విడుదల చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆలయాల ఆభరణాల రికార్డులు త్వరలోనే డిజిటలైజేషన్ చేయాలని దేవదాయ శాఖకి సిఫారసు చేస్తామన్నారు. ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకి ఆభరణాలు సమర్పించే దాతలు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని తెలియజేసే విధంగా బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. కాగా దాతలు సమర్పించిన బంగారు, వెండి, ఇతర విలువైన వస్తువులు రికార్డుల ప్రకారం లేవని, వస్తువుల వివరాలను బహిర్గతం చేయాలని, వాటికి సంబంధించి రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారో లేదో తెలియపరచాలని కడప జిల్లాకు చెందిన కె.ప్రభాకరాచారి అనే వ్యక్తి దేవదాయ శాఖకి ఫిర్యాదు చేయడంతో ఈ విచారణ జరుగుతోంది.

మానవతా విలువలతో ఉత్తమ జీవనం

పెందుర్తి: నశించిపోతున్న మానవతా విలువలను కాపాడాలన్నదే ప్రజాపిత బ్రహ్మ బాబా తత్వమని బ్రహ్మకుమారి సత్యవతి అన్నారు. పురుషోత్తపురంలోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో శనివారం బ్రహ్మ బాబా 55వ సంస్కరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవామార్గంలో నడవాలని ఆకాంక్షించారు. మానవతా విలువలపై నిరంతరం ఆధ్యాత్మిక తరగతులు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకు వస్తున్నామని చెప్పారు. ముందుగా బ్రహ్మ బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

వైభవోపేతంగా గౌరీపరమేశ్వరుల మహోత్సవం

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



అమ్మవారి రథం వద్ద కోలాటం ఆడుతున్న మహిళలు



కాళీమాత వేషంలో



వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఉత్సవంలో కాళీమాత నేలవేషం

అనకాపల్లి: వేల్పులవీధిలో గౌరీపరమేశ్వరుల మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేలవేషాలు, తప్పెటగుళ్లు, స్టేజ్ ప్రోగ్రాములు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎంపీ బీవీ సత్యవతి విష్ణుమూర్తి దంపతులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మలసాల రమణారావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, కార్పొరేటర్లు మందపాటి సునీత జానకీరామరాజు, జాజుల ప్రసన్నలక్ష్మి రమేష్ దంపతులు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, వివిధ ప్రభుత్వశాఖ అధికారులు, వ్యాపారవేత్తలు ఇక్కడ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ కమిటీ అధ్యక్షుడు వాకాడ బాబు, కార్యదర్శి మద్దాల నూకరాజు, కోశాధికారి వేల్పుల గణేష్‌లు శాలువాలతో సత్కరించి అమ్మవారి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు శీరంశెట్టి నర్సింగరావు, సహాయ కార్యదర్శి పనసా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద వితరణ..

అమ్మవారి ఉత్సవాన్ని పురస్కరించుకుని వేల్పులవీధిలో దివంగత పూసర్ల వేణుగోపాలరావు స్వగృహం వద్ద భక్తులకు 25 కేజీల పులిహోర, 20 కేజీల కొమ్ముశనగలు, అమ్మవారి ఆలయం వద్ద పలు సంఘాల ప్రతినిధులు, జక్కం బ్రదర్స్, పసుపులేటి ప్రకాష్ తదితరులు పులిహోర, కిచిడి, సత్యనారాయణస్వామి ప్రసాదాలు పంచిపెట్టారు. మరి కొంతమంది భక్తులు మెయిన్‌రోడ్డు, నెహ్రూచౌక్ జంక్షన్, కన్యకాపరమేశ్వరి ఆలయం, తదితర ప్రాంతాల్లో ఉత్సవానికి వచ్చే భక్తులకు ప్రసాదాలు అందజేశారు.



ఉత్సవంలో వివిధ రకాలైన వస్తువుల అమ్మకాలు



ఉత్సవంలో వివిధ రకాలైన వస్తువుల అమ్మకాలు



ఉత్సవంలో వివిధ రకాలైన వస్తువుల అమ్మకాలు



ఆలయం వద్ద ప్రసాదం పంపిణీ



అమ్మవారి ఆలయం వద్ద భక్తుల కోలాహలం



అమ్మవారి ఉత్సవంలో మెయిన్‌రోడ్డులో కిక్కిరిసిన భక్తులు

ఉపాధి కల్పించాలని రైతులు, యువకుల ధర్నా

- వంగలిలో ఇండియన్ మారిటైం యూనివర్సిటీ ప్రతినిధులకు వినతి

సబ్బవరం: మండలంలోని వంగలి గ్రామంలో ఉన్న ఇండియన్ మారీటైం విశ్వవిద్యాలయంలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ భూ నిర్వాసిత రైతులు శనివారం విశ్వవిద్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వంగలి గ్రామానికి చెందిన పెద్దలు, భూములిచ్చిన రైతులు ఆకుల గణేష్ తదితరులు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఏర్పాటు సమయంలో స్థానికులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. భూసేకరణ సమయంలో గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతామని, గ్రామ రహదారిని విస్తరించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. వర్సిటీ నిర్మాణం పూర్తయి సుమారు 6 సంవత్సరాలైనా స్థానికులు, భూ నిర్వాసితులకు ఉపాధి కల్పించలేదన్నారు. అనేక మంది స్థానికేతరులకు ఉపాధి కల్పిస్తూ స్థానికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ విషయం పలుమార్లు ప్రజాప్రతినిధులు, కలెక్టర్, వర్సిటీ పెద్దలకు తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. ఇటీవల స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేక ధర్నాకు దిగినట్లు తెలిపారు. వర్సిటీ పెద్దలు వచ్చి డిమాండ్లపై తమతో చర్చించారన్నారు. హౌస్ కీపింగ్, గార్డెనింగ్ ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారన్నారు. తమ డిమాండ్ల పరిష్కారానికి వర్సిటీ పెద్దల నుండి సానుకూల నిర్ణయం వచ్చేంత వరకూ ధర్నా కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శించారు. తహసీల్దార్ బి. చిన్నికృష్ణ ధర్నా శిబిరాన్ని సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, భూ నిర్వాసితులు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.